విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 01 ఏప్రిల్ 2025 8 పేజీలు

# మోదీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

## సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

**విశాలాంధ్ర - బుట్టాయిగూడెం/వేలేరుపాడు:** కేంద్రంలో మోదీ మూడవసారి పగ్గాలు చేపట్టిన తర్వాత వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నిర్వహిస్తూ సీపీఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతా సోమవారం బు ట్టాయిగూడెంకు చేరుకుంది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ మోదీ నిత్యం తన ప్రసంగంలో భారత్ వెలిగిపోతుందని అబద్ధాలు వల్లె వేస్తారని, భారత్ వెలిగిపోతుంటే దేశంలో 80 కోట్ల మందికి నెల నెల ఐదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలు అందించవలసిన అగత్యం ఏమిటని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 29 మంది బడాబాబులు బ్యాంకులకు రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోయారని అన్నారు. వీరిలో గుజరాత్ కు చెందిన వారు 28 మంది ఉన్నారని పేర్కొన్నారు. మోదీ హయాంలో హోల్ సేల్ అవినీతికి ఇది నిదర్శనం అన్నారు. మోదీ పాలనలో జన జీవనం అస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. దశాబ్దాల కాలంగా ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తూ, అనేక చట్టాలను, హక్కులను సాధించిందని తెలిపారు. అధికారం చేజిక్కించుకున్న ప్రభుత్వాలు మాత్రం బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములను త్యాగం చేసిన గిరిజనులను ఆదుకొని వారు నివసి స్తున్న నిర్వాసిత కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కలుగచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయకుండా అధికారులు తూట్లు పొడుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1/70 చట్టానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిత్యం అధికారులు గిరిజనుల అభివృద్ధి ▶మిగతా 2లో..

# ఉరి వేసుకొని మహిళా ఖైదీ ఆత్మహత్య

**విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు :** హత్య కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఒక మహిళ జైలులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తీవ్ర చర్చనీయాంసంగా మారింది. గత వారం రోజుల క్రితం ఏలూరులోని జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చిన ఆ మహిళ తెల్లవారు జామున ఉరి వేసుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, జైలు అధికారులు తెలిపిన వివరాలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి మండలానికి చెందిన గంధం శాంతకుమారి గత కొంతకాలం క్రితం తన ప్రియుడితో కలిసి భర్త గంధం బోస్ ను హత్య చేసిన కేసులో నిందితురాలిగా ఉంది. ఈ నేపథ్యంలో బోస్ హత్య కేసులో అరెస్టు చేసిన శాంత కుమారిని రిమాండ్ నిమిత్తం ఈ నెల 24వ తేదీన ఏలూరు జిల్లా ▶మిగతా 2లో..

# మే 20న సార్వత్రిక సమ్మె

## విజయవంతం చేయండి : కోనాల భీమారావు

**విశాలాంధ్ర -తణుకు:** కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకంగా బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా నరేంద్రమోడీ ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు కోరుతూ మే 20న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని తణుకు ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపు నిచ్చారు. సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవనంలో జరిగిన ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశానికి భీమారావు ▶మిగతా 2లో..

# పొంచి ఉన్న పెను ప్రమాదం

## ఆదమరిస్తే ప్రాణాపాయం

**విశాలాంధ్ర - సీతానగరం:** రహదారిపై పెను ప్రమాదం పొంచిఉంది. మండలంలో చినకొండేపూడి గ్రామ పంచాయతీ నుండి చీపురుపల్లి, నాగంపల్లి పంచాయతీలకు, ఎన్ టి ఆర్ నగర్ చినకొండేపూడి పేదల ఇళ్ళ స్థలాలకు ప్రయాణించే రహదారి బంగ్లా వద్ద కల్వర్టు గత మూడు సంవత్సరాల నుండి ప్రమాదకరంగా మారిన సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు కల్వర్టు మధ్యలో గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రమాద భరితంగా మారింది. ద్విచక్ర వాహన దారులు ఆదమరిస్తే ప్రాణాలుపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వర్షాకాలం ఈ కల్వర్టు పై నుండి కొండ గోదావరి ప్రవాహం ప్రవహించే సమయంలో మరింత ప్రమాదంగా మారుతుంది అని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యకు ఎండా కాలంలోనే పరిష్కారం చేయాల్సి ఉంది. వానలు మొదలైతే ఇక్కడ నిర్మాణం సాధ్యం కాదని ప్రజలు అంటున్నారు. ఇదే రహదారిలో చీపురుపల్లి గ్రామ శివారులో తొర్రిగడ్డ కాలువ పై నిర్మించిన వంతెన కూడా ప్రమాదకర స్థితిలో ఉందని, ఎప్పుడు శిథిలమవుతుందోనని ప్రజలు భయభ్రాంతులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలను పలు మార్లు గ్రామ ప్రజలు, రైతులు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకు వెళ్లినా పరిష్కారం దొరకలేదు అని వాపోతున్నారు. ప్రమాదం జరగక ముందే నాయకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

# మంచినీటి చెరువు ప్రారంభం

**విశాలాంధ్ర - ఉంగ్రాజవరం:** రోజురోజుకు తీవ్రమవుతున్న ఎండ వేడిమి తో ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. మండలంలోని సూర్యారావుపాలెం గ్రామ ఊర చెరువు ద్వారా ఇంటింటికి తాగునీరు అందించే కార్యక్రమానికి సోమవారం ఆయన కొబ్బరికాయ కొట్టి, ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మెండే లలిత కుమారి, ఉపసర్పంచ్ నందిన శ్రీనివాసులు చెరువు తవ్వకం పనుల గురించి మంత్రికి వివరించారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి, కాలువ నీటిని చెరువులోకి నింపి, స్టోరేజ్ ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసిన తాగునీరు ఇంటింటికి పంపిణీ చేస్తామని తెలిపారు. సూర్యారావుపాలెంతో పాటు పరిసర ప్రాంతాలలోని దువ్వ, ▶మిగతా 2లో..

# వైద్య సిబ్బంది నిర్లక్ష్యం...ఆటోలో ప్రసవం

**విశాలాంధ్ర - బుట్టాయిగూడెం :** వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ గిరిజన మహిళకు ఆటో లోనే ప్రసవం జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గుర్రప్పగూడెంకు చెందిన కాకా వెంకటేష్ భార్య లక్ష్మీ గర్భవతిగా దొరమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముందస్తు సేవలు పొందుతుంది. ఈ క్రమంలో ఆమెకు ఏప్రిల్ 19వ తేదీన కాన్పు వస్తుందని డాక్టర్లు నిర్ధారించి, సేవలు అందిస్తున్నారు. లక్ష్మీ తరచూ ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలు పొందుతూనే ఉంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నొప్పులు వస్తుండడంతో భర్త వెంకటేష్ ఆటోలో భార్య లక్ష్మిని దొరమామిడి పిహెచ్ సి కి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆటోలోనే ప్రసవం జరిగిపోయింది. ఆసుపత్రికి చేరుకున్న లక్ష్మిని ఆస్పత్రి సిబ్బంది చూసి బిడ్డను, తల్లిని ఆస్పత్రిలోనికి తీసుకుని వెళ్లి తల్లి పేగు కత్తిరించారు. కానీ సిబ్బంది నిర్లక్ష్యంగా తల్లి పేగు కత్తిరించిన కత్తెరతో సహా తల్లి బిడ్డను తిరిగి ఆటోలో ఎక్కించి బుట్టాయిగూడెం ఆసుపత్రికి ఉన్నత చికిత్స నిమిత్తం తరలించారు. ఈ క్రమంలో దారిలోనే తల్లి ఆటో లోనే మాయను విడిచిపెట్టడం, ఆటో అంతా మాయతో సహా రక్తసిక్తం కావడంతో కుటుంబ సభ్యులతో సహా ఆటో డ్రైవర్ భయాం దోళనలకు గురయ్యారు. తీరా బుట్టాయిగూడెం సామాజిక ఆస్పత్రికి చేరుకున్న తరువాత తల్లి,బిడ్డకు వైద్యం అందించే అర్హత గల డాక్టరే కరువయ్యాడు. డ్యూటీలో ఉండవలసిన డాక్టర్ పత్తా లేదు.క్రింది స్థాయి సిబ్బంది తల్లి బిడ్డకు అవసరమైన వైద్య సహాయం అందించారు.ఈ సమాచారం తెలుసుకున్న కోట రామచంద్రపురం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సురేష్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

**విశాలాంధ్ర - గణపవరం:** పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ మృతికి సంతాప సూచికంగా శాంతి నిరసన ర్యాలీ పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరం ప్యారిస్ పాస్టర్ రెవ తాటిపాక చిట్టిబాబు ఆధ్వర్యంలో శాంతియుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జల్లి కాకినాడ గ్రామ సర్పంచ్ బాతు నాగేశ్వరరావు (నాగరాజు), కేశవరం లూథరన్ సంఘం జల్లి కాకినాడ పెద్దపేట, చిన్న పేట లూథరన్ సంఘం పెద్దలు సి ఆర్, సాగిపాడు లూథరన్ సంఘం గోపే మనోహర్, బండి సుధా, కేశవరం రక్షణ సైన్యం తిమోతి, సంఘం ఇంజేటి ప్రభాకర్ రావు, మండా భాస్కరరావు, ఇతర పెద్దలు సంఘాల క్రైస్తవ విశ్వాసులు క్రైస్తవ నాయకులు పాల్గొని ప్రవీణ్ మృతి పై న్యాయం జరగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి శాంతి యుతంగా నిరసన తెలిపారు.

## ముదినేపల్లి మండలంలో 100 సిసి కెమెరాలు ఏర్పాటు

**విశాలాంధ్ర - ముదినేపల్లి :** నేరశాతాన్ని అరికట్టేందుకు ముదినేపల్లి మండలంలో 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ముదినేపల్లి పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదినేపల్లి వై జంక్షన్, కైకలూరు రోడ్ , గురజ సెంటర్, వడాలి, సింగరాయపాలెం, కొత్తపల్లి, వైవాక ప్రధాన కుడళ్ళ వద్ద, బీసీ హాస్టల్స్, పాఠశాల, కళాశాలల ముఖ్యమైన స్థలాల్లో ఈ సీసీ కెమెరాలు నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నిఘా నీడలో ముదినేపల్లి మండలం ఉంటుందని శాంతిభద్రతల పరిరక్షణకు దోహద పడుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించే దుకు ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## సీసీ రోడ్లు, వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

**విశాలాంధ్ర - ముదినేపల్లి :** కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ముదినేపల్లి మండలంలో వడాలి, చినకామనపూడి, పెదకామనపూడి, చిగురుకోట గ్రామాల్లో సిసి రోడ్లు ప్రారంభించారు. అనంతరం ముదినేపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. ఏకే స్పెషాలిటీ క్లినిక్ డయాగ్నొస్టిక్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకయ్య, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ , బిజెపి మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలునాగలక్ష్మి ఎన్డీఏ నాయకులు బొర్రా చలమయ్య, దావు నాగరాజు, చలసాని జగన్మోహనరావు, కొత్తూరి చిట్టిబాబు, యర్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ప్రారంభం

(1వ పేజీ తరువాయి)

పసలపూడి, రెడ్డి చెరువు గ్రామస్తులు తాగునీరు కోసం ఈ చెరువును ఉపయోగిస్తారన్నారు. దాతల ఆర్థిక సహాయం సుమారు రెండున్నర లక్షల రూపాయలతో మంచినీళ్లు పట్టుకునేందుకు చెరువు చుట్టూ ఐదు రేవులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పాడైపోయిన డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరగా, తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. చెరువు వద్ద గ్రామస్తుల ఆర్థిక సహకారంతో మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, జెఎస్పి అధ్యక్షులు, గ్రామ కూటమి నాయకులు గ్రామ ప్రజలు, తహసిల్దార్, ఎంపీడీవో, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఈఓపిఆర్‌డి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సమ్మె

(1వ పేజీ తరువాయి)

అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మికులను కట్టు బానిసలను చేయడమే కాకుండా జీవించే హక్కును హరించి వేస్తాయన్నారు.

దినానికి 8 గంటల పని తీసేసి 10 గంటలు పెట్టడం, యూనియన్‌లు పెట్టుకునే హక్కు నిరాకరించడం, కనీస వేతనాలు అడిగే హక్కు లేకుండా చేయడం లాంటి కార్మిక వ్యతిరేక విధానాలు లేబర్ కోడ్ ల ద్వారా అమలుకు పూనుకోవడం కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెట్టడం తప్ప మరొకటి కాదన్నారు.

దేశంలో సుమారు 60 కోట్ల మంది కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కార్మిక చట్టాలు తొలగించి లేబర్ కోడ్ లు తేవడాన్ని వ్యతిరేకిస్తూ తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతానికి అందరూ కృషి చేయాలని భీమారావు కోరారు.ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సావారపు దేవీ, పిండి సత్యవతి, వలవల అరుణకుమారి, పట్టపు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య

(1వ పేజీ తరువాయి)

జైలుకు తరలించారు. అప్పటినుండి ఆమె జిల్లా జైల్లో ఖైదీగా ఉంటున్నది. ఈ తరుణంలో తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన శాంతకుమారి ఎవరూ లేని సమయంలో బ్యారక్ లో ఉన్న కిటికీకి తన శరీరంపై ఉన్న చున్నీ మెడకు బిగించుకొని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జైల్లో విధులు నిర్వహిస్తున్న వార్డెన్ వరలక్ష్మి ఈ సంఘటనను గమనించి శాంత కుమారి ఆత్మహత్య చేసుకున్న సమాచారాన్ని జైలు ఉన్నతాధికారులకు తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

శాంత కుమారి జైల్లో ఉరి వేసుకున్న నేపథ్యంలో శవ పంచనామా నిర్వహించేందుకు ఏలూరు ఆర్టీవో అచ్చుత్ అంబరీష్, రెవెన్యూ సిబ్బంది జిల్లా జైలును పరిశీలించి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కేసును వన్ టౌన్ సిఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా భాష నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిర్వీర్యం

(1వ పేజీ తరువాయి)

కోసం పాటుపడుతున్నట్లు ఆర్బాటపు ప్రకటనలు చేస్తున్నారని, గిరిజన సమస్యలపై స్థానిక రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు అందజేస్తే నిర్లక్ష్యంగా దస్త్రాలను మెట్లపై పారవేయడం వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు పోడు భూములకు పట్టాలు మంజూరు చేసి పేద ప్రజలకు ఇల్లు స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, సీపీఐ మండల నాయకులు చోడెం దుర్గ, బేతిన కిషోర్, నరేంద్ర,శివ, కురసం సూర్యచంద్రం, తెల్లం మునీశ్వరరావు, మడకం దుర్గారావు, గంగరాజు, సింగారమ్మ, మోహన్, శ్రీను, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వేలేరుపాడు మండలంలో**

వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సీపీఐ ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ నాయకులకు హామీలు ఇవ్వడం గద్దెనెక్కాక అవి గాలికి వదిలేయటం అలవాటుగా మారిందన్నారు. అధికారం చేపట్టిన నాయకులు చిత్తశుద్ధితో పరిపాలన చేయాలని సూచించారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం పట్టణాలలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను డీ.డీ లు కట్టిన లబ్దిదారులకు స్వాదీన పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వసంతరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, బాడిశ రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి శివకుమార్, కురిమల వెంకటేశ్వర్లు, తాటి దుర్గారావు, కట్టి రాంబాబు, కారం కుమారి, కారం రాజమ్మ, మిరియాల శివ, మిరియాల రాము తదితరులు పాల్గొన్నారు.

## మద్దిలో పంచాంగ శ్రవణం

### దేవస్థానానికి రూ.లక్షా 30వేల ఆదాయం

**విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని గురవాయిగూడెం గ్రామం మద్ది ఆంజనేయస్వామివారి సన్నిధిలో స్వామివారికి విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆలయ అర్చకులచే పంచాంగ శ్రవణం నిర్వహిం చారు. ఈ కార్యక్ర మంలో

కరాటం రాంబాబు, గురవాయిగూడెం పంచాయతీ సర్పంచ్ సత్యవేణి, జంగారెడ్డి గూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు. స్వామి వారి దర్శనార్థం రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ అధ్యక్షులు వేగేశ్న సూర్యనారాయణరాజు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు దేవస్థానంలో ఉగాది పచ్చడి అందజేశారు. స్వామి వారి నిత్య అన్నదాన సత్రము నందు సుమారు 2వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆదివారం మధ్యాహ్నం గం.2 వరకు మొత్తం రూ.1 లక్ష30వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్.వి. చందన తెలిపారు.

## వక్ఫ్‌పై కేంద్రం సవరణలపై శాంతియుత నిరసన

**విశాలాంధ్ర-భీమడోలు:** ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను భీమడోలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం సోమవారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తొలుత భీమడోలు మసీదు వద్ద నల్లరిబ్బన్ ధరించి వక్ఫ్ బోర్డు పై కేంద్రం సవరణలను వ్యతిరేకిస్తూ శాంతియుత ర్యాలీగా మసీదు నుంచి పీర్ల చెరువు ముస్లింలు ఈద్గా మైదానానికి చేరుకున్నారు. మసీద్ హిమామ్ దిల్షాద్ నేతృత్వంలో సామూహిక ప్రార్థనలను నిర్వహించారు. ఖురాన్ సూక్తులను వినిపించి, ప్రత్యేక ప్రార్థనలు దువా చేయించారు. ముస్లిం జీవితంలో రంజాన్‌కు ఎంతో ప్రాధాన్యత కలదని,ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ రంజాన్ మాసంలో ఆవిర్భవించిందన్నారు.రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించాలన్నారు.ప్రార్ధనలు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ చైర్మన్ షేక్ హసేనా,కమిటీ సభ్యులు సైన్ షా సిద్దిఖ్, రసూల్,షరీఫ్, జానీ,గాలిబ్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**విశాలాంధ్ర-టి నరసాపురం:** బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని ఎస్ఐ ఎం. జయబాబు తెలిపారు. స్థానిక లూయిస్ దాగురే బస్సు షెల్టర్ వద్ద మండలం ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగ, లెమన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ జయబాబు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలి అన్నారు. భవిష్యత్తులో ఫోటో గ్రాఫర్స్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఫోటో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి. చందు, ఉపాధ్యక్షులు మహారాజ్, కోశాధికారి వాసు, కమిటీ సభ్యులు రామారావు, ధర్మారావు,రాజు తదితరులు పాల్గొన్నారు.

## చేనేతను ఆదరించాలి

**విశాలాంధ్ర -భీమవరం:** చేనేత వస్త్రాలు ఆరోగ్యానికి మేలని, పూర్వ కాలంలో చేనేత వస్త్రాలపై ఆధారపడే వారని, నేడు చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ రాయితీ తోపాటు 20 శాతం విద్యుత్ ఉచితంగా అందించడం గొప్ప విశేషమని సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి

అన్నారు. చేనేత వస్త్రాల వాడకంపై ఇంటింటికి ప్రచార భేరి కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆప్కో సహకారంతో నిర్వహించారు. ప్రస్తుతం చేనేత వస్త్రాలపై అవగాహన పెంపొందించాలని, ప్రతి అపార్ట్‌మెంట్ వద్ద ఎగ్జిబిషన్ అండ్ సేల్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చేనేత వస్త్రాలను వాడాలని అన్నారు. ఆప్కో మేనేజర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 30 శాతం డిస్కౌంట్ అందిస్తుందని, స్వచ్ఛంద సంస్థలు ప్రచారం చేయడం ఒక స్ఫూర్తి అని అన్నారు.

## బోస్‌కు కళారత్న అవార్డు

**విశాలాంధ్ర -భీమవరం:** పట్టణానికి చెందిన ప్రఖ్యాత ఇంద్ర జాలికుడు, రచయిత మేజిక్ స్టార్ డాక్టర్ బోస్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా 'కళా రత్న' అవార్డుతో 50,000 రూపాయల చెక్కును, ప్రశంసా పత్రాన్నీ అందు కున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్

ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్ సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో బోస్ అవార్డు, నగదు అందుకున్నారు. బోస్ గత 55 ఏళ్లుగా ఇంద్రజాల కళ వ్యాప్తికి నిర్విరామ కృషి చేస్తున్నారు. ఆ కళకు సంబంధించి అనేక గ్రంథా లను కూడా రచించారు. బోస్‌కు లభించిన ఆ పురస్కారం పట్ల రాష్ట్రంలోని పలువురు మెజీషియన్లు హర్షాన్ని ప్రకటించారు.

## నేటి నుంచి ఉపాధి రుణాలకు ముఖాముఖి

**విశాలాంధ్ర-వీరవాసరం:** మండలంలో స్వయం ఉపాధి సోపానం దరఖాస్తుదారు లకు 1వతేదీ నుంచి 3వ తేదీ వరకు వీరవాసరం మండల పరిషత్తు కార్యాలయంలో ముఖాముఖి నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో బీవీవీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 949 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా రంజాన్

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** మానవాళి హితాన్ని ఆకాంక్షించే , రంజాన్ పర్వ దినాన్ని అత్యంత భక్తి ప్రపత్తుల తో జరుపుకోవాలని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బలుసు నాగేశ్వరరావు పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా

కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న మజీద్ గురువును స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం రంజాన్ నెల అని, నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి, ఉపవాస దీక్షలు ముగించుకొని రంజాన్ పండుగ నిర్వహించుకుంటున్న ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రంజాని, ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగ సందర్భంగా కొయ్యలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదర, సోదరీమణులు, బంధు మిత్రులతో ఆనందంగా జరుపుకున్నారు. ముస్లిం గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాలలో ముస్లిం సోదరులంతా పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్

**విశాలాంధ్ర - గణపవరం:** రంజాన్ పండుగ పురస్కరించుకొని సోమవారం ముస్లిం సోదరులు గణపవరం మసీదులో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి, పెద్ద గురువు అర్షాన్ అన్సారి, చిన్న గురువు ఫరూఖలి ముతవాలి, మొహమ్మద్ ఇస్మాయిల్, సెక్రటరీ షేక్ నాగూర్, బహదూర్, షేక్ రహమతుల్లా, షేక్ బషీరుద్దీన్ గణపవరం చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులు ఈ మసీదులో ప్రార్థనలు చేశారు.

**ఉంగుటూరు :** ఉంగుటూరు గ్రామంలో మసీదు వద్ద సోమవారం పవిత్రమైన రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మసీదు వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రార్థనలు చేశారు. అల్లా చూపిన మార్గంలో నడవాలని, అల్లా చల్లని దీవెనలు అందరికీ ఉండాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కలిదిండి:** పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపు కున్నారు. సోమవారం మండలంలోని మూలలంక, కోట కలిదిండి గ్రామాలలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేయుటకు కలిదిండిలో ఈద్గా వద్ద అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ఒకరినొకరు అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినం అన్నారు. 30 రోజులు పాటు కఠోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు. అల్లా చల్లని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో రంజాన్ వేడుకలు ఆహ్లాదంగా జరుపుకున్నారు.

**పాలకోడేరు :** ముస్లిం సోదరుల ప్రతిష్టాత్మమైన పండుగల లో ముఖ్యమైన రంజాన్ పండుగ దాతృత్వానికి ప్రతీక అని గరగపర్రు ఎంపీటీసీ, ముస్లిం పెద్ద షేక్ పాపా సాహెబ్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో రంజాన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మతాలకతీతంగా గ్రామ పెద్దలను విందుకు ఆహ్వానించి వారి కి పర మతం పై ఉన్న ప్రేమను చాటారు. కార్యక్రమంలో షేక్ పాప సాహెబ్, షేక్ అబ్దుల్లా, షేక్ లాలాసాహెబ్, షేక్ బాషా, షేక్ మీరావాలి, వలీ ఖాన్, సిద్దిక్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

**నూజివీడు :** పవిత్ర రంజాన్ పర్వదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూజివీడు పట్టణం ఆర్డీవో కార్యాలయం వద్ద గల ఈద్గా వద్ద రంజాన్ ను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద హఫీజ్ షేక్ తస్లీమ్ దువా సందేశాన్ని ఇవ్వగా పెద్ద మసీద్ మసీద్ బిలాల్ మసీద్ చిన్న మసీద్ కొత్వాల్ మసీద్ ఈద్గా మసీద్ కుమార్ తదితర మసీదులకు చెందిన ముస్లింలు వేలాదిగా ఈద్గాకు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు అనం తరం ఒకరినొకరు అలింగనం చేసుకొని ఈద్‌శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

**టి.నరసాపురం:** టి నరసాపురంలో భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో ఇస్లాం మత ప్రబోధకులు ముంతాజ్ అన్సారీ, హఫీజ్ నదీమ్ రంజాన్ పండుగ ప్రత్యేకతను ముస్లింలకు వివరించారు. అనంతరం స్థానిక ఖబరస్తాన్ చేరుకుని అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు షేక్ అబ్బాస్, షేక్ షరీఫ్, సామాజిక కార్యకర్త యస్‌డి నాసర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల హక్కుల సాధనకు పదవీ త్యాగానికైనా సిద్ధం

### ఎమ్మెల్యే బడేటి చంటి

**విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు :** ముస్లిం సోదరుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఇందులో భాగంగా అవసరమైతే తన ఎమ్మెల్యే పదవిని త్యాగం చేయడానికైనా సిద్ధమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని కర్బలా మైదానంలో అంజుమన్-ఏ- ముహాఫీ జుల్ ఇస్లాం ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం ప్రత్యేక ప్రార్థనల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ముస్లిం సంప్రదాయం ప్రకారం మత పెద్దలు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ముస్లిం సోదరులతో పాటు ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ముస్లిం సోదరుల హక్కుల సాధించి పెట్టేందుకు పోరాటాలు చేసేందుకు

తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. హిందూ, ముస్లింలు అన్న దమ్ముల్లా కలిసికట్టుగా ఉండేందుకు అవసరమైన సుహృద్భావ వాతావరణం ఎప్పుడూ ఉంటుందని, ఒకరికొకరు పరస్పరం సహాయ, సహకారాలు అందించు కుంటూ సోదరభావంతో మెలగాలని ఎమ్మెల్యే చంటి ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, కో - ఆప్షన్ సభ్యులు ఎస్మెమ్మార్ పెదబాబు, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, రాజేష్, ముస్లిం మత పెద్దలు ఎండి సులేమాన్, అస్లాం షరీఫ్, రాజా అహ్మద్, షేక్ జబివుల్లా, ఎండి ఇక్బాల్, అంజాద్ బాషా, షేక్ జావిద్ మారం అను, ఎండి జానీ కార్పొరేటర్ ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ లస్కర్లకు రూ.6.50 కోట్లు బకాయి వేతనాలు విడుదల

**విశాలాంధ్ర - ఏలూరు :** నీటిపారుదల శాఖలోని గోదావరి డెల్టా సిస్టంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉగాది కానుకగా బకాయి వేతనాలు విడుదల చేయడం పట్ల రాష్ట్ర నీటి పారుదలశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ హర్షం

వ్యక్తం చేశారు. గోదావరి డెల్టా సిస్టంలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో సుమారు 600 మంది లస్కర్లుగా పనిచేస్తున్నారు. వీరికి గత 10 నెలలుగా జీతాలు రాకపోవడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు లస్కర్ల సమస్య పరిష్కారం కోసం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఇరిగేషన్ ఉన్నత అధికారులతో మాట్లాడి రూ.6.50 కోట్ల రూపాయలను ఉగాది రోజున ఏజెన్సీకి జమ చేయించారు. దీంతో లస్కర్ల బకాయి వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకి చోడగిరి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

## కళారత్న అవార్డు గ్రహీత సబ్బి కనకారావుకు అభినందనలు

**విశాలాంధ్ర-కామవరపుకోట:** ఉగాది వేడుకల సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేతుల మీదుగా కళారత్న అవార్డులు అందుకున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్య

మండలి గౌరవాధ్యక్షులు, సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావుకి, తూర్పుగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి పునర్నిర్మాణ వ్యవస్థాపకులు సీనియర్ బుర్రకథ కళాకారులు, గొర్రెల రాముకి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్, బుర్రకథ కళాకారులు టీవీఎస్ రాజు సోమవారం ఒక ప్రకటనలో అభినంద నలు తెలిపారు. సబ్బి కనకారావు చిన్నతనం నుండే పాటలు పాడుతూ పద్మశ్రీ నాజర్ బుర్రకథను స్ఫూర్తిగా తీసుకొని కమ్యూనిస్టు పార్టీ సభలలో వేలాది బుర్రకథలు చెప్పి ప్రజలను చైతన్యవంతుల్ని చేసే వారని కొనియాడారు.వీరమల్ల సత్యనారాయణ, ఎల్ఆర్ కృష్ణ బాబు, బచ్చు నందకుమార్, కళాభిమానులు సాయన్న అనుపమ్మ, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయిన కనకరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ వీరమల్ల మధు, రంగస్థలం నటుడు తిరుపతి రమేష్, తదితరులు కనకారావుకు కళాభివందనాలు తెలిపారు.

## సత్యసాయి మంచినీటి పథక కార్మికులకు జీతాలు చెల్లించాలి

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** శ్రీసత్య సాయి మంచినీటి పథక కార్మికులకు 7 నెలల నుండి జీతాలు రావడంలేదని జీతాలు ఇప్పించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాలదేవిని ఆమె నివాసంలో శ్రీసత్య సాయి మంచినీటి పథక కార్మికులు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు. వారి సమస్యలు విన్న ఆమె వెంటనే సంబంధిత జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈతో

చరవాణి ద్వారా కార్మికుల సమస్యను తెలియజేసి, జీతాలు వెంటనే ఇవ్వాలని తెలిపారు.ఆమెతో ఆయన మాట్లాడుతూ గ్రాంట్ రాగానే జీతాలు ఇస్తామని తెలిపారు. గత ఐదు సంవత్సరాల నుండి సత్యసాయి మంచినీటి పథక కార్మికులకు సరిగ్గా జీతాలు ఇవ్వలేకపోతున్నామని ఆయన తెలిపారు. మేఘల దేవి మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్‌కు, పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు తమ సమ స్యను తెలియజేసి పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిల్లి నాగ వీరబాబు, ఎం. రామకృష్ణ,ఎస్ రమేష్,శ్రీనివాస్, ఎ. కృష్ణ పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం

### ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

**విశాలాంధ్ర- ఉంగుటూరు :** అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉంగుటూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముప్పన భుజంగరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ప్రెస్ క్లబ్ నిర్మాణం, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉంగుటూరులో ప్రెస్ క్లబ్ భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి పైడి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాసరావు, గౌరాధ్యక్షులు పాంద్రా కుల పెద్దిరాజు, కోశాధికారి అర్జా బుల్లి వీరా స్వామి, రవి పాల్గొన్నారు.

## అత్యున్నత ఆశయంతో ముస్లింల ఉపవాసదీక్షలు

**విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు :** ప్రజలందరికీ మంచి జరగాలనే అత్యున్నత ఆశయంతో పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు నిర్వహించడం ఎంతో గొప్పవిషయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇదేరీతిలో ఎల్లప్పుడు హిందూ, ముస్లింలు అన్నదమ్ముల భావనతో కలిసికట్టుగా మరింత ముందుకు పయనించాలని ఆకాంక్షించారు. ఏలూరు కత్తేపువీధిలోని జామియా మసీదులో పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్ధసారధి, కో - ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, త్రిపర్ణ రాజేష్, మారం అను, ముస్లిం మత పెద్దలు ఎస్కె జావెద్ అహ్మద్, జానీ, పాషి, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీ రామారావు చేసిన సేవలు మరువలేం

**విశాలాంధ్ర - గణపవరం:** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీని 43 సంవత్సరాలు పూర్తి చేసుకుని 44 సంవత్సరం లోకి దిగ్విజయంగా అడుగు పెట్టిందని ప్రజల్లో తెలుగుదేశంపై మంచి నమ్మకం ఉందని గణప వరం మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కూనసాని నాగేశ్వరరావు అన్నారు. గణపవరం మండలం కొత్తపల్లి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి అనంతరం జండా ఆవిష్కరణ చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆయన అడుగుజాడల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీని బలోపేతం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు నిమ్మల సుబ్బారావు, నాయకులు ముద్దక వెంకటేశ్వరరావు, మద్దాల రాంబాబు, గొల్లపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూకు ఆడియో విజువల్ సూపర్వైజర్‌గా పదోన్నతి

**విశాలాంధ్ర -భీమవరం:** జిల్లా సమాచార శాఖ భీమవరం కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సిహెచ్ శ్రీనివాస నెహ్రూ కు ఆడియో విజువల్ సూపర్వైజర్ గా పదోన్నతి లభించింది. ఏలూరు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఆయనను నియమిస్తూ విజయవాడ సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మార్చి 31న భీమవరం కార్యాలయం విధులు నుండి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు సి హెచ్ శ్రీనివాస్ నెహ్రూను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అంద జేశారు. శ్రీనివాస్ నెహ్రూ ఆడియో విజువల్ సూపర్వైజర్‌గా పదోన్నతి పొందడం పట్ల ఏపీఆర్ కె.సత్యనారా యణరాజు, రికార్డ్ అసిస్టెంట్ డి.సోమరాజు, ఫోటోగ్రాఫర్ పివై. రత్నాకర్, సిబ్బంది పి.వీరభద్రం, జె. రాజేష్ బాబు అభినందనలు తెలిపారు.

# పోలవరం 45.72 ఎత్తులోనే నిర్మించాలి

### సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం/ పోలవరం/ జంగారెడ్డిగూడెం రూరల్ :** పోలవరం ప్రాజెక్ట్ 45.72 ఎత్తులోనే నిర్మాణం చేపట్టాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపుమేరకు మార్చి 23వ తేదీన భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14 రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వరకు సిపిఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతా ఆదివారం కొయ్యలగూడెం, పోలవరం. జంగారెడ్డిగూడెం రూరల్‌లో కొనసాగింది. కొయ్యలగూడెం, పోల వరం, జంగారెడ్డిగూడెం రూరల్ ప్రాంతాల్లోని ప్రధాన సెంటర్లలో ప్రజలనుద్దేశించి కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్విస్ బ్యాంకు లో నుండి నల్లధనాన్ని బయటకు తీసి పేద ప్రజలకు వారి బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేస్తానని, ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు నిరుద్యోగ యువ తకు కల్పిస్తామని, చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల వాగ్దానాలను గాలికి వదిలేసారని విమర్శించారు. గిరిజనులకు అడవు లను దూరంగా చేసి, అడవులలో ఉండే సహజ వనరులను బడా పెట్టుబడిదారులైన ఆదాని, అంబానీ లాంటి వారికి కట్టబెట్టడానికి గిరిజనులను బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేద లందరికీ పట్టణాలలో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేయాలని పోరాడు తుంటే, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.4లక్షలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం సరైన చర్య కాదన్నారు. కొయ్యలగూడెం మండలంలో రాజవరం, ఎర్రంపేట, కనకాద్రి పురం, తిమ్మన కుంట, మంగపతి దేవి పేట,తదితర గ్రామాలలో పోరాటాలు చేసి పేద ప్రజలకు, ఇండ్ల స్థలాలు, పోడు భూములు, పంచిన ఘనత సిపిఐ కి ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, సిపిఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పోలవరం మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు, సీపీఐ జంగారెడ్డి గూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, జిల్లా సమితి సభ్యులు గొలిమే బాలయేసు, సీనియర్ నాయకులు తుమ్మూరి రామకృష్ణారెడ్డి, శాఖ కార్యదర్శి కలపాల శ్రీరాములు, దాసరి నాగభూషణం, ఆశీర్వాదం, చందా త్రిమూర్తులు, తాళ్లూరి నాగరాజు, హను మంతు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి క్రాంతి కుమార్, లక్క లక్ష్మణరావు, ఎస్కే బాజీ, రాంబాబు,మట్ట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.పి.నెం. 7/2025
బిట్వీన్
కొళ్ళ శ్రీనివాసరావు - పిటిషనర్
మరియు
1. యాతం సూర్య ఆదినారాయణ స్వామి
2. శ్రీమతి శిరిగినీడి జ్యోతి
3. ది. అఫిషియల్ రిసీవర్, పశ్చిమగోదావరి జిల్లా - రెస్పాండెంట్లు
పై నెంబరు పిటిషన్, పిటిషనర్, రెస్పాండెంట్ల పైన కోర్టులో దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ ది. 21-4-2025 తేదీన వాయిదా అయి ఉన్నది. సదరు విషయం రెస్పాండెంట్లకు మరియు యావత్తూ ప్రజానీకానికి తెలియ చేయడమైనది.
షెడ్యూలు
పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం, పాలకొల్లు సబ్ రిజిస్ట్రారులో చేరిన పాలకొల్లు పట్టణం, 14వ వార్డు కటికల వారి వీధిలో డోరు నెం. 35-4-6, అసెస్మెంట్ నెం. 1079007628, ఆర్.ఎస్.నెం.210 గల ఖాళీ స్థలం 95 గజాలు ఈక్రింది హద్దుల మధ్య: తూర్పు: తోట హేమ వెంకట సత్య సూర్య పద్మశ్రీ గారి స్థలం, పడమర : వంగా రామ్‌ప్రసాద్ మరియు మూర్తి కామేశ్వరరావు గారి ఆస్తి, ఉత్తరం : జాయింటు గోడ మరియు కంచర్ల పురుషోత్తంగారి ఆస్తి, దక్షిణం : మున్సిపల్ రోడ్డు.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.,బి.ఎల్.,
శ్రీమతి యస్.జ్యోతి,
అడ్వకేట్స్, పాలకొల్లు-534260
పాలకొల్లు, తేది : 30-3-2025

## ఈద్గా అభివృద్ధికి కృషి : మంత్రి పార్ధసారధి

**విశాలాంధ్ర-నూజివీడు :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించు కొని నూజివీడు ఈద్గాలో నిర్వ హించిన ప్రత్యేక ప్రార్ధనలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడులోని ఈద్గా అభివృద్ధికి తన వంతు సహకారాలు అందిస్తానన్నారు. ఈద్గా స్థలానికి నీరు తోలడంతో పాటు త్రీ ఫేజ్ కరెంటు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశిం చారు. ముస్లిం పెద్దలు సుభాని, జిలాని, షబ్బీర్ టిడిపి నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షులు జగదీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో ముందుకు సాగండి

**విశాలాంధ్ర - ఏలూరు :** జిల్లాలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయడంతో పాటు ప్రజాసేవలో ముందుకు సాగి పేద ప్రజలకు మరింత సేవ చేయాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి పొలిమేర జయరావు ఆకాంక్షించారు. బిషప్ పొలిమేర జయరావు గురు పట్టాభిషేకం పొంది 34 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సోమవారం బిషప్ జయరావుపే కలిసి దుశ్శాలువాతో అభినందించి సత్కరిం చారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులను ఆశీర్వదించి ప్రజా సేవలో ముందుకు సాగాలని సూచించారు.

## ప్రవీణ్ మృతిపై సిబిఐ విచారణ జరిపించాలి

### భారీ ర్యాలీలో క్రైస్తవుల డిమాండ్

**విశాలాంధ్ర -భీమవరం:** క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల మృతిపై సిబిఐ విచారణ జరిపించాలని క్రైస్తవ సంఘాలు భీమవరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా లూథరన్ గ్రౌండ్లో జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ వ్యక్తిత్వ హననాన్ని కించ పరిచేలా మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని వారు ఖండించారు. దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించ దానికి ప్రయత్నాలపై క్రైస్తవ సమాజం చూస్తూ ఊరుకోదని వారు హెచ్చరించారు. తొలుత లూథరన్ గ్రౌండ్ నుంచి అంబెద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గంటా సుందర్ కుమార్, చిగురుపాటి సందీప్, పిల్లి రవికాంత్ , అంబటి ఆనంద్ కుమార్, పిల్ల డైమండ్ రాజు, బట్టు ఏసురాజు, పెద్ద సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - సామర్లకోట :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని, అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు పేర్కొన్నారు. ముస్లింల పవిత్ర పండగ రంజాన్ పురస్కరించుకుని సామర్లకోట సిబిఎం సెంటర్ సమీపాన సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలను ఏర్పాటు చేయగా సామర్లకోట పరిసర ప్రాంతాల్లో మసీదుల నుంచి పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు హాజరై ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక ప్రార్థనలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చినరాజప్ప, కూడా చైర్మన్ రామస్వామి హాజరై మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణులంతా పండగ పర్వదిన వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని, పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని అన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. ముస్లిం సంఘ నాయకులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### ముస్లింలు రంజాన్ ప్రార్థనలు

**విశాలాంధ్ర - జగ్గంపేట :** మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ముస్లింలు మసీదుల వద్ద ప్రార్థనలు చేశారు. జగ్గంపేటలో షాదీ ఖానా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కె శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 30 రోజులు ఉపవాస దీక్షలు చేసారన్నారు. అందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏ గఫూర్, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

### సర్వ మానవ సమానత్వానికి ప్రతీక రంజాన్ :ముద్రగడ

**విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి :** సర్వ మానవ సమానత్వానికి, కరుణకు దాతృత్వానికి ప్రతీక పవిత్ర రంజాన్ పండగ అని మాజీ మంత్రి వైసీపీ నాయకులు ముద్రగడ పద్మనాభరెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా కిర్లంపూడి ఆయన నివాసంలో సోమవారం ముస్లింలకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. విందుకు హాజరైన ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులు ముద్రగడ ఇంటి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ గిరిబాబు వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంపీపీ ఎన్నికల్లో ఎంపీటీసీలకు బెదిరింపు: సత్తి

**విశాలాంధ్ర - అనపర్తి :** ఎవరికో పుట్టిన బిడ్డను తమ బిడ్డగా చెప్పుకునే స్థాయికి నియోజకవర్గ బీజేపీ దిగజారిపోయిందని ఆ పార్టీ నేతలను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సంచలన ఆరోపణలు, వ్యాఖ్యలు చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాజీ ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ ఇటీవల బిక్కవోలు మండల పరిషత్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, ఎన్డీఏ నేతలు బెదిరింపులు, ప్రలోభలతో వైసీపీ ఎంపీటీసీలను లొంగదీసుకున్నారని ఆరోపించారు. మండలంలో బిజెపికి ఒక ఎంపీటీసీ లేరని అటువంటిది బిజెపి ఎంపీపీ ఏ విధంగా గెలిచినట్టని మాజీ ఎమ్మెల్యే సత్తి ప్రశ్నించారు. కక్కిన కూటికి కక్కుర్తి పడి బిజెపి మండల పరిషత్ సాధించి ఇదేదో గొప్ప విజయంగా చెప్పుకుని బీజేపీ స్థాయిని దిగజారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సత్తి విమర్శించారు. ముందు వైసీపీ ఎంపిటిసిలతో రాజీనామా చేయించి బీజేపీ గుర్తుపై గెలిపించుకుని అప్పుడు గొప్పలు చెప్పుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు.

## అభివృద్ధి సూచికల అమలుకు సిబ్బంది నియామకం : కలెక్టర్

**విశాలాంధ్ర - తూర్పుగోదావరి :** విజన్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన 10 ప్రాధాన్యత అంశాలను గుర్తించి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను జిల్లా స్థాయిలో, నియోజక వర్గ స్థాయిలో అమలు చేయ్యాడానికి ఐదు మంది చొప్పున సచివాలయ సిబ్బందిని నియమించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలోని మెరుగైన పనితీరు కలిగిన 700 మంది సిబ్బందిని రాష్ట్ర స్థాయిలో గుర్తించడం జరిగిందన్నారు. ఆయా వివరాలను మండల ప్రజా అభివృద్ధి అధికారులకి తెలియ జేయడం జరిగిందన్నారు. ఆయా జాబితా ఆధారంగా ప్రాధాన్యత కార్యక్రమాలు జిల్లా అభివృద్ధి మరింత సమర్థవంతంగా చేపట్టి దిశలో ఆసక్తి చూపించిన సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంగా 5 మంది , నియోజక వర్గ స్థాయిలో ఐదు మంది చొప్పున మొత్తం 40 మంది ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 15 మంది ముందుకు రావడం జరిగిందని, మొత్తం దరఖాస్తులను పరిశీలించి విధులను కేటాయించనున్నట్లు తెలియ చేశారు. ఇప్పటికే గుర్తించిన 700 మంది సిబ్బంది ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తి కలిగిన సచివాలయ సిబ్బంది నేరుగా సిపివోకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధి సూచికలు ఆధారంగానే క్షేత్ర స్థాయిలో సిబ్బంది విధులను బాధ్యతలని చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. జిల్లా నోడల్ అధికారిగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, సాంకేతిక పరమైన అంశాలపై జిల్లా అభివృద్ధి అధికారి వ్యవహరిస్తారని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఆయా సిబ్బంది ఆసక్తి, ప్రభుత్వ కార్యక్రమాల అమలు చేయడం లో నిబద్ధతను పరిశీలించే విధానం లో ఇంటర్వ్యూలు నిర్వహించి, ఏప్రియల్ మొదటి వారం చివరి వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు.

# రక్తదానం మరొకరికి ప్రాణదానం

**విశాలాంధ్ర - కడియం :** సంకల్పం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు వివిధ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ, సామాజిక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కడియం మండలం కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయం నందు సోమవారం 'సంకల్పం' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసారు. ఈ శిబిరాన్ని కడియం సీఐ అల్లు వెంకటేశ్వర రావు, 'సంకల్పం' వ్యవస్థాపకులు యడ్ల వరప్రసాద్, గంధం శంకర్, సత్య, భానుశ్రీ, సూరిబాబులు ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ మనం చేసే రక్తదానం మరొకరికి ప్రాణాన్ని నిలుపుతుందని, హెల్మెట్ ధరించడం ద్వారా స్వీయ రక్షణతో ప్రాణం కాపాడుతుందని పేర్కొన్నారు. రక్తదాతలకు హెల్మెట్లు అందించడం ఆలోచించదగ్గ విషయమని, సమాకూర్చిన వారికి అభినందనలు తెలిపారు. హరిత సంకల్పం అధ్యక్షులు గాధ నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ 'సంకల్పం' సేవా సంస్థ ద్వారా ఇప్పటి వరకూ సుమారు 7,200 యూనిట్ల

రక్తాన్ని సేకరించి, వివిధ బ్లడ్ బ్యాంక్‌లకు అందించడం జరిగిందన్నారు. శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసిన దాతలకు, రక్త సేకరణకు సహకరించిన రాజమహేంద్రవరం సంజీవని బ్లడ్ బ్యాంకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. తమ కుమారుడు తాడాల వీరబాబు జ్ఞాపకార్థం హెల్మెట్లు అందించిన తల్లిదండ్రులు తాడాల వెంకట రమణ (శ్రీను), సూర్య కుమారిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడియం ఎస్సై దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, మాజీ అధ్యక్షులు మల్లు పోలరాజు, బొరుసు సుబ్రహ్మణ్యం, గెడ్డం శివ, ఆకుల భాస్కరరావు, తిరుమల హరి, వారా దొరబాబు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

**విశాలాంధ్ర - కడియం :** పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు, సంఘాల నేతలు ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. కడియంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్ నుంచి దేవి సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు అధిక సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొని శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సై నాగ దుర్గాప్రసాద్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫెలోషిప్ ఉపాధ్యక్షులు కరుణాకర్, నగర ప్రాంతీయ చైర్మన్ డి పరజ్యోతి, ఏఐసీసీ రీజినల్ చైర్మన్ జయశీల్, మండల అధ్యక్షుడు బిషప్ సొలోమోను, కడియం మండల పాస్టర్ సంఘం అధ్యక్షుడు మూడీ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనంకు ఆహ్వానం

**విశాలాంధ్ర - ఆత్రేయపురం :** దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికు శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య కళ్యాణ మహోత్సవం ఆహ్వాన శుభ పత్రికను అందజేసిన దేవస్థానం ఈఓ యన్ఎస్ చక్రధర్‌రావు. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం మండలం పరిధిలోని వాడపల్లి గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో ఈ నెల ఏప్రిల్ 7 నుంచి 13 వరకు జరుగనున్న వార్షిక కళ్యాణోత్సవాలుకు రావాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిను శుక్రవారం గొల్లపూడి కార్యలయంలో ఆయన ఉప కమిషనర్ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి యన్ సూర్య చక్రధర్ రావు మర్యాద పూర్వకంగా కలిసి వార్షిక వెంకన్న దివ్య కళ్యాణ మహోత్సవంకు ఆహ్వాన పత్రికతో ఆహ్వానించారు. దేవస్థానంలో జరిగే స్వామివారి వార్షిక కళ్యాణోత్సవాలను గురించి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డికు ఈఓ యన్ఎస్ చక్రధర్‌రావు వివరించారు.

## విసనకర్ర పర్యావరణానికి, శారీరక ఆరోగ్యానికి దోహదం

**విశాలాంధ్ర - ఆత్రేయపురం :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అనూస్ హెూమ్ వద్ద రావులపాలెం సామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో తాటి ఆకుల విసినికర్రలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రముఖ సినీ నటులు గౌతమ్ రాజు, జోగి నాయుడు, నెల్లూరు హరిబాబులు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటి ఆకుల విసిన కర్రల వాడకం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు శారీరక ఆరోగ్యాన్ని, విద్యుత్ ఆదా చేసుకోవచ్చు అని అంతే కాకుండా కొంతమందికి జీవనోపాధిని కూడా కల్పించవచ్చునని కాబట్టి ఈ వేసవి తాపాన్ని తట్టుకోవడానికి తాటి విసిన కర్రలను అందరూ ఉపయోగించాలని కోరుకుంటూ వీటిని పంపిణీ చేస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు గౌతమ్ రాజు, జోగి నాయుడు, నెల్లూరు హరిబాబు, జైపూర్ రాంబాబు, పెద్దింటి రామం, సిద్ధాంతి సత్తిబాబు, మేస్త్రి నాగు, ఆత్మకూరు కాశి, శేషయ్య, లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ సీత, డాక్టర్ సూర్య చంద్ర రావు, శ్యామ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి

**విశాలాంధ్ర - చాగల్లు :** తూర్పుగోదావరి జిల్లా, చాగల్లు మండలంలోని అన్ని మసీదులలో సోమవారం నాడు రంజాన్ పర్వదినాన్న ముస్లింలందరూ చేతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసనను తెలియజేశారు.. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు 2024ను అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని, లేకపోతే ముస్లిం జాతి కనుమరుగు అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.

## నల్లమిల్లికి 'ఆంధ్ర రాష్ట్ర ఉగాది పురస్కారం'

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి ఉగాది పర్వదినం ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 'ఆంధ్ర రాష్ట్ర ఉగాది పురస్కారం' అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో సుబ్బారెడ్డిని సీఎం జ్ఞాపికతో సత్కరించారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శిగా విశిష్ట సేవలందిస్తున్న నల్లమిల్లి సుబ్బారెడ్డికి ఉగాది పురస్కారం లభించింది. పురస్కార గ్రహీత నల్లమిల్లి సుబ్బారెడ్డికి రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, ప్రముఖ హైకోర్టు సీనియర్ న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, ఎం డి ఓ మండ రామకృష్ణారెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్, ఇంకా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్మలగిరి నిత్యాన్నదానంకు దాతలు వితరణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నంలో కొలువైన నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదాన అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చార విజయవాడ పడమట కి చెందిన విద్యుత్ శాఖ ఏఈ దాసరి కిరణ్ కుమార్- శ్రీవిద్య దంపతులు దాసరి పాండురంగ, సాతులూరి వెంకట నరసయ్య జ్ఞాపకార్థం ఒక్కరోజు అన్నదానానికి లక్ష ఆర్థిక సాయం అందించారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఎస్ జాన్ పీటర్, అన్నదాన గుత్తేదారుడు కళ్లే నాగేశ్వరరావుకు రూ. లక్ష నగదును అందజేశారు. దాతలు దాసరి కిరణ్ కుమార్ కుటుంబాన్ని పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు.

# 'వక్ఫ్ బిల్లు' ఉపసంహరించాలి

విశాలాంధ్ర - కడియం : మసీదులకు సంబంధించిన ఆస్తులను స్వాధీన పరుచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ అమాండ్ మెంట్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కడియం మస్జిద్ ఏ కౌసర్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ సలీం కోరారు. 'ఈదుల్ ఫితర్' సందర్భంగా కడియం మసీదులో ముస్లిం సోదరులు సోమవారం ఉదయం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు వక్ఫ్ ఎమాండ్ మెంట్ బిల్లుకు వ్యతిరేకంగా చేతికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు వక్ఫ్ అమాండ్ మెంట్ బిల్లుకు మద్దతునివ్వడం అమానుషం అన్నారు. అందుకనే ఈ రెండు రాష్ట్రాల సీఎం లను వ్యతిరేకిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చేటువంటి ఇఫ్తార్ కార్యక్రమాలు కూడా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.

ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై మద్దతును ఉపసంహరించుకోవాలని కోరుకుంటున్నామని సలీం తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సర్దార్ భాషా, షేక్ రహీం, షేక్ గౌస్, షేక్ బాషా, షేక్ యాకూబ్, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

# సిరిబొమ్మ ఉత్సవంలో ఇరువర్గాల మధ్య గొడవ

విశాలాంధ్ర-తాళ్లపూడి : తాళ్లపూడిలో ఉగాది సందర్భం గా జరిగిన సిరిబొమ్మ ఉత్సవంలో అపశృతులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాలపై రెండు కేసులు నమోదు అయ్యాయి. ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఉత్సవంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒకరిపై ఒకరు గొడవలకు దాడులకు దిగారు. వివరాల్లోకి వెళితే ఉగాది పర్వదినాన తాళ్లపూడిలోని గ్రామ దేవత మోదుగులమ్మ ఉత్సవం సందర్భంగా సిరిబొమ్మకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో సిరిబొమ్మను ఓ కొయ్యకు కట్టి బహిరంగ ప్రదేశంలో తిప్పుతారు. ఆ సమయం జీడి మామిడి పళ్ళను సిరిబొమ్మపై విసరడం ఆచారంగా వస్తుంది. సిరిబొమ్మను తిప్పే క్రమం ప్రారంభం కాక మునుపే పళ్ళతో రాళ్లతో కొట్టారు. ఈ నేపథ్యంలో నెలకొన్న వివాదం రెండు కులాల మధ్య వివాదంగా మారింది. మొదట్లో పోలీస్‌లు కొద్ది సర్దుబాటు చేసినప్పటికీ అక్కడ వడ్డీలు, అగ్నికుల క్షత్రియులు మధ్య వివాదం గా ముదిరింది. రాత్రి అంతా

ఆ ప్రాంతం లో భీకర వాతావరణం నెలకుంది. వడ్డీలకు చెందిన ఇంట్లోకి రాత్రి సమయం లో వెళ్లి వస్తువులను చెల్లా చేదురు చేసి బైక్ పడ వేసి నిప్పు పెట్టె సమయంలో పోలీసులు చూసి ప్రమాదం జరగకుండా నివారించారు. వివాదం ముదిరి పాకాన పడింది. వడ్డీలు, అగ్నికుల క్షత్రియులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ మేరకు తాళ్లపూడి ఎస్సై తోట రామకృష్ణ రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపేరు. దర్యాప్తు చేస్తున్నారు. ఇరు వర్గాల నుండి పది మందిని పైగా వివాదానికి కారకులైన వారిని గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ముస్లింలకు రంజాన్‌తోఫా కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం లక్ష్మీపురం లో రంజాన్ పవిత్ర పండగ పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ నేతలు మెంట్ మీ సురేష్ అమరావతి దంపతులు ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు లక్ష్మీపురం మసీదు వద్ద జరిగిన కార్యక్రమంలో 70 ముస్లిం కుటుంబాలకు తోఫా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మింటిమి సురేష్ అమరావతి దంపతులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫ అందజేస్తున్నామని తెలిపారు ఈ సంవత్సరం కూడా అందజేశామని వెల్లడించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ

కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బోలిన శ్రీధర్, ఎర్ర గొల్ల వెంకటేశ్వరరావు, పటాన్ లాల్, పటాన్ కమల్, పాక అర్జున్, కుమారపు మహేంద్ర శేషు దావీదు స్థానిక తెలుగుదేశం నాయకులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## సీఆర్‌సీ ప్రధాన కార్యదర్శి వీర్రాఘవరెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెదపూడి/అనపర్తి : రావులపాలెం సీఆర్‌సీ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికైన కోస్తాంధ్ర రెడ్డిసంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రావులపాలెంలో వీర్రాఘవరెడ్డికి జరిగిన సన్మాన సభకు అనపర్తి, పరిసర ప్రాంతాల నుంచి వచ్చి శుభాకాంక్షలు తెలిపినట్లు కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాథ్ రెడ్డి, యువజన సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, యువజన కార్యదర్శి, జి కలికి రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త పడాల నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, గౌరవ సలహాదారు తాడి సత్తిరెడ్డి, హెల్త్ కన్వీనర్ గొలుగూరి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోకాటి నాగేశ్వరరావుకి సన్మానం

విశాలాంధ్ర-అమలాపురం : సోమవారం నడిపూడి డా బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలు నందు జరిగిన సమావేశంలో డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సివిల్ సప్లై విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ మానిటరింగ్ సభ్యుడిగా ఎన్నికైన, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మోకాటి నాగేశ్వరరావుని డా బాబు జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడికి సత్యనారాయణ, తెన్నేటి రాజబాబు, సభ్యులు నొండ్రు వాడపల్లి, కొరుకూరి కృపావరం, నొండ్రు లక్ష్మణరావు, వెల్ఫేర్ సొసైటీ వైస్ ప్రెసిడెంటు కాపు నాగభూషణం, కార్యదర్శి చేట్ల సత్యనారాయణ, డైరెక్టర్లు మంద వెంకటేశ్వరరావు, కొడమంచిలి క్రిష్ణ, నూటికుర్తిమూర్తి పాల్గొన్నారు.

## పేదవారి ఆకలి తీర్చాలన్న సంకల్పంతో అన్నా క్యాంటీన్

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేదలకు ఆహారాన్ని వడ్డించారు. గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి దిడ్డి చక్రవర్తి, వెంకట్రాజుల సహాయంతో నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్‌కు ఎమ్మెల్యే నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ పేదవారి ఆకలి తీర్చాలన్న సంకల్పంతో మా నాయకుల సహకారంతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి, పేదలకు ఆహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పోతుల మోహన్ రావు, ఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రసాద్‌కు విశ్వగురు వరల్డ్ రికార్డ్ ఉగాది పురస్కారం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోటకు చెందిన అంతర్జాతీయ కూచిపూడి నృత్యకారుడు అలమండ ప్రసాద్ అత్యంత ప్రాధాన్యత గల విశ్వ గురు వరల్డ్ రికార్డ్-2025 ఉగాది పురస్కారంను అందుకున్నారు. కాకినాడలో విశ్వగురు వరల్డ్ రికార్డ్ ఉగాది పురస్కారాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా చేపట్టారు. పిఠాపురంనకు చెందిన శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా ముఖ్యఅతిథిగా పాల్గొని ఉగాది పురస్కారంను కూచిపూడిలో అంతర్జాతీయంగా రాణిస్తున్న అలమండ ప్రసా ద్‌కు బహుకరించి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉమర్ అలీషా మాట్లాడుతూ సమాజం వినా శనం వైపు కాకుండా వికాసం వైపు

వెళ్లాలని సూచించారు. మానవ సేవే మాధవ సేవ అని ప్రతి ఒక్కరికి తెలియజేయా లన్నారు. ఉగాది పురస్కారం అందుకున్న నృత్యకారుడు అలమండ ప్రసాద్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సినీ డైరెక్టర్ వీర శంకర్, ఈవెంట్ చైర్మన్ సుందరపల్లి గోపాలకృష్ణ, పైడికొండల కిషోర్ కుమార్, కెవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలంలో అన్ని గ్రామాలలో రంజాన్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని త్యాజంపూడి యాదవోలు చిన్నాయి గూడెం గౌరీపట్నం రంగరాయ కాలనీ దేవరపల్లి దుద్దుకూరు ఎర్నగూడెం గ్రామాలలో ముస్లిం సోదరులు మసీదు కెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కాకినాడ : విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగాపంద్ర వాడ జంక్షన్ వద్ద వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ జగన్మాత సదా శివ మందిరంను టీడీపీ నాయకులు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దార్శికతతో రాష్ట్రం అన్ని విధాలా అభివృధి చెందాలని కోరారు. మందిరం వ్యవస్థాపకులు పాలిక సత్యనారాయణ లక్ష్మి దంపతులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావుకి ఉగాది పచ్చడితో అమ్మవారు ఆశీస్సులు ఉండాలని కోరారు. తెలుగు ప్రజల పండుగ ఉగాది అని ఈ ఉగాది పండుగ చాలా ప్రత్యేకం అని కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత వచ్చిన మొదటి తెలుగు సంవత్సరం పండుగ అని డాక్టర్ చప్పిడి వేంకటేశ్వరరావు అన్నారు. ఆర్థికంగా రాష్ట్రంకి ఎన్ని ఒడి దుడుకులు ఉన్న ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాబోయే భవిష్యత్ కాలంలో మన రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృధి చెందిన రాష్ట్రంగా బావి తరాలకు అందించాలనే తపనతో పని చేస్తున్నారని అన్నారు. రామచంద్రపురం సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న, వారి సభ్యులు ఉగాది పర్వదిన సందర్భంగా డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి పూర్ణ సురేష్‌లను భారీ గజమాలతో ఘనంగా సత్కరించి అభినందన జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న మాట్లాడుతూ తగ్గిపోతుందిలే ఏం పర్వాలేదు అనే మీ ఆత్మీయ స్పర్శతో పేదలకు బడుగు, బలహీన వర్గాల వారికి భారం కాకుండా వైద్య సేవలు అందిస్తున్న మీ ఆత్మీయత అనురాగాలకు భగవంతుడు మిమ్మల్ని ఆయురారోగ్యాలతో చూడాలని కోరుచున్నామన్నారు. అలయన్స్ గవర్నర్ వనం శ్రీనివాసరావు, నేదూరి శేషగిరి, బంగారు బాబు, ధూళిపూడి ప్రభాకర్, శ్రీనివాస్ మాస్టారు, రాంబాబు, హృతిక్‌శ్రీ, ట్రస్ట్ సభ్యులు సరళ భవాని, దుర్గ, శ్యామల పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

విశాలాంధ్ర - సీతానగరం: మత సామరస్యానికి, త్యాగానికి ప్రతీకగా రంజాన్. మండలంలో సీతానగరం గ్రామంలో స్థానిక మసీదులో సోమవారం ఘనంగా రంజాన్ పండుగను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రత్యేక ఖురాన్ పఠనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 30 రోజులు ఉపవాసంతో రంజాన్ జరుపుకుంటారన్నారు. ప్రత్యేకంగా ఖురాన్ పట్టణం మసీదులో నిర్వహిస్తారు. ఈ పవిత్ర మాసంలో దానధర్మాలు పంచుకునే నెలగా ఈ నెలను భావిస్తారుఅన్నారు. ఈ కార్యక్రమంలో గురువు ఎండి . మౌజన్ షేక్ ఉమర్ షరీఫ్, సయ్యద్ కరీముల్లా, ఎండి బాబు, షేక్ దర్గావల్లి, షేక్ నాగూర్, షేక్ హుస్సేన్, షేక్ జిలాని, షేక్ అలి, ముస్తఫా షేక్ జిలాని షేక్ బాబు షేక్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు

## ఆర్టిస్ట్ డా సునీల్ కుమార్ యాండ్రకు నంది అవార్డు

విశాలాంధ్ర - పిఠాపురం : సీనియర్ జర్నలిస్ట్, ఫిల్మ్ ఆర్టిస్ట్ డా సునీల్ కుమార్ యాండ్రకు నంది అవార్డు లభించింది. బంగారుతల్లి లఘుచిత్రానికి కథ, స్క్రీన్ప్లే, మాటలు రచించినందుకు శ్రీ విఘేశ్వర ఆర్ట్ సొసైటీ నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా నంది అవార్డుతో రచయిత డా సునీల్ కుమార్ యాండ్రను హైదరాబాద్లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. 4నెలల క్రితం శ్రీవిశ్వకర్మ క్రియేషన్స్, ఆర్కె క్రియేటివ్స్, జివివి ఎంటర్ టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మించిన బంగారు తల్లి లఘుచిత్రంలో టిక్టాక్ స్టార్ దుర్గారావు దంపతులు, చైల్డ్ ఆర్టిస్ట్ మంజూశ్రీ, నటులు ఆర్కె, దాకే సింహాచలం, బాబి, సూరిబాబు, పెద్దాడ వెంకటేశ్వరరావు, ఇతర నటీనటులు నటించిన బంగారు తల్లి లఘుచిత్రం కోమటి రామకృష్ణ (ఆర్కె) దర్శకత్వం వహించగా టిక్టాక్ స్టార్ దుర్గారావు అఫీషియల్ యూట్యూబ్ ఛానల్ రిలీజ్ అయ్యింది. రిలీజ్ అయ్యిన అతి కొద్ది కాలంలోనే సుమారు లక్షా 80వేల మంది ప్రేక్షకుల తిలకించి విశేష ఆదరణ కనబరిచారు. ఈ సంధర్భంగా నంది అవార్డు గ్రహీత డా సునీల్ కుమార్ యాండ్ర మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్ సొసైటీ ఫౌండర్ ఛైర్మన్ బండారి శ్రీధర్ నానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సంధర్భంగా అవార్డు ప్రధానం చేయడం జరిగిందని, ఈ అవార్డు తెలుగు చలన చిత్ర పరిశ్రమకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, వెండితెర, బుల్లితెర నటుడు జెమిని సురేష్, నటులు దిల్ రమేష్, బిహెచ్ఈఎల్ ప్రసాద రావు, సినీయర్ దర్శకులు బాబ్జి, నిర్మాత ముసాఆలీఖాన్, మోడల్ సృజన, జూనియర్ పవన్ కళ్యాణ్, జూనియర్ చంద్రబాబు, సుమిత్ మీడియా సిఈఓ వంశీకృష్ణల చేతుల మీదుగా తీసుకోవడం జరిగిదన్నారు. బంగారు తల్లి చిత్రానికి దర్శకత్వం వహించిన డా కోమటి రామకృష్ణకు ఉత్తమ దర్శకుడిగా అవార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా డా సునీల్ కుమార్‌కు పిఠాపురం పట్టణ ప్రముఖులు, రాజకీయనాయకులు, స్నేహితులు, పాత్రికేయ మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

విశాలాంధ్ర - కాజులూరు : ఏపీ ట్రాన్స్‌కో ప్రధానమైన 220kv సామర్లకోట సబ్ స్టేషన్‌లో విద్యుత్ కంట్రోల్ ప్యానల్స్ ఏర్పాటు చేయునట్లు రామచంద్రపురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రత్నాలరావు సోమవారం వెల్లడించారు. ఏప్రిల్ 2, 3తేదీల్లో రామ చంద్రపురం, గంగవరం, కపిలేశ్వరపురం, రామచం ద్రపురం రూరల్, మండపేట, ఆలమూరు, రాయవరం వంటి మండలాల్లో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలలో తరచూ అంతరాయాలు కలుగుతుందన్నారు. ఈ క్రమంలో విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా మరియు రామచంద్రపురం మండలంలో నివాస విద్యుత్ వినియోగదారులు ముందుగానే తగు ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రత్నాలరావు కోరారు.

## న్యాయమూర్తి ప్రసాద్ బాబా మృతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన గ్రామం రామస్వామి తోటకు చెందిన విశ్రాంత జిల్లా న్యాయమూర్తి నల్లా రాజా ప్రసాద్ బాబా(70) అనారోగ్యంతో హైదరా బాదులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు వున్నారు. బాబా అంత్యక్రియలను ఆదివారం రామస్వామితోటలోని స్వగృహం వద్ద పూర్తి చేశారు. ఆయన గతంలో హైదరాబాద్, తెనాలి, భీమిలి, గుడివాడ, గుంటూరు, విశాఖపట్నం తదితరచోట్ల న్యాయమూర్తిగా పనిచేశారు. స్వయం శక్తిపై న్యాయమూర్తిగా ఎదిగిన ప్రసాద్ బాబా అకాల మృతితో కాట్రేనికోన శోక సప్తమయింది. బాబా తండ్రి నల్లా శేషారావు ఉపాధ్యాయుడిగా పనిచేసి గతంలోనే మృతి చెందారు. బాబా మృతి పట్ల స్థానిక సర్పంచి గంటి వెంకట సుధాకర్. వైసీపీ నాయకులు నల్లా నర్సింహమూర్తి, జగడం బాలయోగి, సివి రావు, హరికిషోర్, మోకా అప్పాజీ గ్రామస్తులు సంతాపం తెలిపారు.

## కులం పేరుతో దూషణ, దాడి చేశారని ఫిర్యాదు

విశాలాంధ్ర - కాట్రేనికోన : బలుసుతిప్ప పంచాయతీకి చెందిన మంచినీటి ట్యాంకులను స్థానిక సర్పంచ్ ఆదేశా లతో శుభ్రపరుస్తున్న తనను గ్రామానికి చెందిన సంగాని వెంకటేష్ అతని అనుచరులు కులం పేరుతో దూషిస్తూ, దాడి చేశారని అదే గ్రామానికి చెందిన నిమ్మితి నాగరాజు సోమవారం కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ సందర్భంగా బాధితుడు నాగరాజు మాట్లాడుతూ సుమారు 40 మంది ప్రజలు ఉండగా వారి సమక్షంలో నన్ను కొట్టడమే కాకుండా, కులం పేరుతో దూషించాడని, నాకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని నా ఆత్మాభిమానం దెబ్బతినేలా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాగరాజు కోరాడు. బాధితుడు నాగరాజును ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో దళిత నాయకులు గెల్లా రాజేంద్ర, బుద్ధ రాజు, గిడ్ల శ్రీను, ముదు దుడ్డి వెంకటరమణ తదితరులు పరామర్శించారు.

## పేదలకు క్యారేజీలు పంపిణీ

విశాలాంధ్ర - తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మర్పన్ భోజనం క్యారేజీలు దాతలు సహకారంతో అనేక మంది నిరుపేదలకు అందజేయడం జరుగుతుంది అని క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్య రాజు అన్నారు. వుంగరాల రామచంద్రరావు జ్ఞాపకార్థం భార్య విజయ ప్రతీ నెలా ఒకరోజు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రంజాన్ సందర్భంగా ముంబాయికి చెందిన హర్షద్ ఆలీ, అయిషా దంపతులు ఆధ్వర్యంలో భోజనం క్యారేజీలు అందజేశారు. రీజియన్ ఛైర్మన్ బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, ధూళిపూడి వెంకటరమణ (బాబి), సామా భగవాన్ గుప్తా, బాలాజీ, రాయుడు సింహాచలం, సూరంపూడి నాగు తదితరులు పాల్గొన్నారు.

## మలబార్ ఆభరణాలకు దేశ మార్కెట్లో ప్రత్యేక స్థానం : మంత్రి

విశాలాంధ్ర - అమలాపురం : అంతర్జాతీయ ప్రమాణాలకు అను గుణంగా మలబార్ గోల్డ్ అండ్ డైమం డ్స్ భారతదేశ మార్కెట్లో ప్రముఖ స్థానా న్ని ఆక్రమించాయని మలబార్ గోల్డ్ వజ్ర, వైడూర్యాలు మోడల్స్ అందరిఇ ఆకట్టుకుంటున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నా రు. ఉగాది సందర్భంగా ఆదివారం అమలాపురం కేఎన్ఎఫ్ రోడ్‌లో కొల్లూరి గున్నయ్య బిల్డింగులో ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ జ్యువెలరీ షోరూంను మంత్రి వాసంశెట్టి సుభాష్ లాంచనంగా ప్రారంభించారు. షాపులోని వివిధ విభా గాలను ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బత్తుల ఆనందరావు, యానాం మాజీ మంత్రి మల్లాది కృష్ణారావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, మరో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లా డుతూ మలబార్ గోల్డ్‌లోని మోడల్స్ అందరికీ నచ్చుతాయన్నారు. బంగారం, వజ్రాలు నాణ్యత, మన్నికకు బహిరంగ మార్కెట్లో అన్ని కంపెనీల మోడల్స్ పోటీనిస్తున్నాయని సుభాష్ కొనియా డారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ గోల్డ్ మార్కెట్‌లో రాష్ట్రంలో మలబార్ గోల్డ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అమలా పురం వంటి వ్యవసాయ ప్రధా నమైన పట్టణంలో మలబార్ గోల్డ్ షోరూంను ఏర్పాటు చేయటం ముదవ హం అన్నారు. ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు మాట్లాడుతూ అమలా పురం పట్టణంలో అనేక గోల్డ్ షోరూం లు ఏర్పాటు చేస్తున్నారని, వీటిలో మల బార్ గోల్డ్‌కు ప్రత్యేక స్థానం ఉంద˜న్నారు. టిడిపి రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడి స్వామి నాయ డు, గంధం పళ్లంరాజు, భవన యజ మాని కొల్లూరి చినబాబు, పాండిచ్చేరి మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు, మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రా యిల్, ఏడిద శ్రీను, గండి స్వామి, కల్వకొలను తాతా జీ, నల్లా విష్ణు, వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీను, చిట్టూరి పెదబాబు, మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము, గోవాల రాజేష్, మున్సిపల్ కమిషనర్ కేవీవీఎస్ రాజు పాల్గొన్నారు.

# నత్త నడకన ఆసుపత్రి నిర్మాణ పనులు

- రూ.8.50 కోట్లు నిధులతో 50 పడకల ఆసుపత్రి పూర్తికాని వైనం
- పట్టించుకోని ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అదనపు భవనం నిర్మాణంకు నాడు నేడు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ నిధులు రూ. 8.50 కోట్లుతో చేపట్టిన నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మాణం పనులు అసంతృప్తిగా నిలిచిపోయాయి. ఈ ఆసుపత్రి భవనం నిర్మాణంకు నాగార్జున నిర్మాణ సంస్థ 2022 సంవత్సరంలో ఈ ఆసుపత్రి భవనం నిర్మాణం పనులు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు పూర్తికాకపోవడంతో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే జాతీయ రహదారికి అత్యంత చేరువలో ఉన్న ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోడ్డు ప్రమాద క్షతగాత్రులతో పాటు సీజనల్ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక రోగుల తాకిడి అధికంగానే ఉంటుంది. సుమారు 50 గ్రామాల ప్రజలు ఈ ఆసుపత్రికి రావడం జరుగుతుంది. తరచూ అత్యవసర కేసులు వస్తూనే ఉంటాయి. గదులు కొరతతో రోగులు, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. సీజనల్ వ్యాధులు విస్తరించిన సందర్భాల్లో రోగులను చేర్చుకునేందుకు గదుల కొరత ఏర్పడుతుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పడ్డ అసౌకర్య పరిస్థితులు ప్రైవేటు ఆస్పత్రులకు వరంగా మారుతోంది. దీంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు రోగుల దగ్గర అధిక మొత్తంలో వైద్య బిల్లులు వసూలు చేస్తున్నారు. ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో అదనపు భవన నిర్మాణ పనులు మొదలై సుమారు నాలుగేళ్లు కావస్తున్న ఇప్పటికీ భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. నిర్మాణ దశలోనే ఉన్న ఈ ఆసుపత్రిని సంబంధిత ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకుని నిర్మాణం పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## సీపీఐ సీనియర్ నాయకుడు దేవ సూర్యారావు మృతి

విశాలాంధ్ర - రాజోలు : మలికిపురం మండలం రామరాజులంక గ్రామానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు దేవ సూర్యారావు (80) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. సూర్యరావు మొదటి తరం కమ్యూనిస్టు నాయకుడిగా గ్రామ కమ్యూనిస్టు ఉద్యమానికి, గ్రామాభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. ఆయనకు 5 గురు కుమార్తెలు సంతానం. సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ సూర్యరావు పార్థివ దేహంపై సీపీఐ జెండా కప్పి నివాళులర్పించారు. పలువురు సీపీఐ నాయకులు సూర్యరావు మృతికి సంతాపం వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతి తెలిపారు.

## జాతరలో యువకుల మధ్య ఘర్షణ చికిత్స పొందుతూ యువకుడి మృతి

విశాలాంధ్ర-వీరవాసరం : మండలంలోని నందమూరిగరువులో దారుణం చోటు చేసుకుంది. జాతరలో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన కాసాని రాజేష్ (17) చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో యువకుల మధ్య జరిగిన వివాదం అనంతరం కొందరు దారికాచి దాడి చేశారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. కుటుంబానికి ఆధారమైన కుమారుడుని చంపేశారని కుమారుని తల్లి, బంధువులు ఆవేదన చెందుతున్నారు. ఘర్షణలో గాయపడిన యువకుడు ఇంటికి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో, ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఘనంగా చలసాని రాజగోపాలరావు వర్ధంతి

విశాలాంధ్ర -నూజివీడు : స్వాతంత్ర సమరయోధులు చలసాని రాజగోపాల్‌రావు 75వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నూజివీడు మండలం వెంకటాద్రిపురంలో నిర్వహించారు. రాజగోపాల్‌రావు స్మారక గ్రంథాలయం వద్ద గ్రామ సీపీఐ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ అరుణ పతాకం ఎగరవేశారు. గ్రంథాలయం వద్ద ఏర్పాటుచేసిన రాజగోపాల్‌రావు చిత్రపటానికి గ్రామ ప్రముఖులు వేములపల్లి శ్రీమన్నారాయణ, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆలూరు పూర్ణచంద్రరావులు పులమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ స్వాతంత్రం కోసం జరిగిన పోరాటాల్లో అనేకరకాల నిర్బంధాలు ఎదుర్కొన్న రాజగోపాల్‌రావు అనంతర కాలంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యమించారన్నారు. రాజగోపాల్‌రావు పేద వర్గాల కోసం చేస్తున్న పోరాటాలను ఓర్చుకోలేని కొందరు ప్రజల కోసం జీవిస్తున్నారని కాల్చి చంపడం బాధాకరమన్నారు. నేటి యువతరం రాజగోపాల్‌రావు స్ఫూర్తితో దేశ అభివృద్ధి కోసం బడుగు వర్గాల అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చలసాని నరేంద్ర, గొళ్ళ నాగరాజు, అన్నవరం గ్రామ ఉపసర్పంచ్ చలసాని గోపాలకృష్ణ, తెలుగుదేశం నాయకులు చలసాని సూర్యనారాయణ తదితరులు పాల్గొని రాజగోపాల్‌రావుకు నివాళులర్పించారు.

## వైవీ సుబ్బారెడ్డిని పరామర్శ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : రాజ్యసభ సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి తల్లి ఇటీవల అకాలంగా మృతి చెందారు. ఈ సందర్భంగా సోమవారం ఒంగోలులో జరిగిన పెద్దరోజు కార్యక్రమానికి హాజరై వైవి సుబ్బారెడ్డిని పరామర్శించిన రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, రామచంద్రపురం నియోజవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యూత్ అధ్యక్షులు పిల్లి సూర్యప్రకాష్, ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి నాయకులు ముదునూరి మురళి రాజు, పిఠాపురం నియోజవర్గ నాయకులు పడిశెట్టి నారాయణరెడ్డి పరామర్శించారు.

# వృద్ధురాలి హత్య కేసు నిందితుడి అరెస్టు

## 57 గ్రాముల ఆభరణాలు స్వాధీనం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ఒక వృద్ధురాలిని అత్యంత పాసవికంగా హత్య చేసి 48 గంటలు గడవక ముందే నిందితుడిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుండి రూ.4 లక్షల విలువ కలిగిన 57 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు వివరాలను వెల్లడించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెన్నవల్లివారి పేటకు చెందిన చనపతి రమణమ్మ (65) అనే ఒంటరి వృద్ధురాలు చిట్టీల వ్యాపారం చేస్తూ జీవితం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న తెల్లవారుజామున రమణమ్మ అత్యంత దారుణంగా హత్యకు గురైంది. నిందితుడు దుర్గాప్రసాద్ మృతురాలి కాళ్ళు, చేతులు కట్టేయడంతో పాటు ఆమె మెడకు నైలాన్ తాడు బిగించి హత్య చేసిన అనంతరం సాక్ష్యాలు మాయం చేసేందుకు శరీరంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అంతేకాకుండా శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను సైతం అపహరించి పరారయ్యాడు. అయితే అదే సమయంలో రమణమ్మ ఇంట్లో మంటలను గమనించిన స్థానికులు వెంటనే ఆమె బంధువులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని మంటల్లో కాలుతున్న రమణమ్మ శరీరంపై నీళ్లు పోసి మంటలు ఆర్పి వేశారు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు జిల్లా ఇన్చార్జి ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఏలూరు జిల్లా ఏఎస్పీ సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఏలూరు డిఎస్పి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో వన్ టౌన్ సీఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ఆరంభించారు. వన్ టౌన్ ఎస్ఐ మదీనా భాష ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితులు కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే రమణమ్మ ఆర్థిక పరిస్థితులపై కూడా హోరతిగా ఆమె కదలికలను ఎప్పటినుండో గమనిస్తున్న అదే ప్రాంతానికి చెందిన చనపతి దుర్గాప్రసాద్ అనే వ్యక్తి రమణమ్మను హత్య చేసి ఆమె వద్ద ఉన్న 57 కాసుల బంగారు ఆభరణాలు అపహరించి పరారైనట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో పోలీసులు నిందితుడు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఏఎస్పి సూర్యచంద్రరావు స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్, వన్ టౌన్ సిఐ జి.సత్యనారాయణ, సిసిఎస్ సిఐ ఆది ప్రసాద్, ఎస్ఐలు షేక్ మదీనా భాష, నాగబాబు, కానిస్టేబుల్ మోహన్ కృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## రాజేష్ కుటుంబానికి రమణారావు పరామర్శ

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయి చెరువుకు చెందిన మధుర రాజేష్ (27) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఆకస్మిక మృతి చెందగా ఆ కుటుంబాన్ని సోమవారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసీపీ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేష్ చిన్నవయసులో ఆకస్మిక మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. రాజేష్ తండ్రి నరసింహమూర్తి, కుటుంబ సభ్యులకు రమణారావు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో వైసీపీ మండల కార్యదర్శి పినిపే జయరాజ్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, పందిరి సుబ్బరాజు గంటా లక్ష్మీ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.